సాక్షి నిజామాబాద్

మంగళవారం : 28 : జనవరి : 2025



ప్రజావాణికి వినతుల వెల్లువ

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి.

- 8లో ▸



చోరీ కేసుల్లో నిందితుడి అరెస్ట్

దుకాణాల షట్టర్లను ధ్వంసం చేసి చోరీలకు పాల్పడుతున్న ముఠా నాయకుడిని అరెస్ట్ చేసినట్లు ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి తెలిపారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
35.8 /13.9

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

బ్యాంకు ఖాతాల్లో 'రైతు భరోసా'

- ఐదెకరాలలోపు రైతులకు జమ చేసిన ప్రభుత్వం



డొంకేశ్వర్(ఆర్మూర్): రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతల బ్యాంకు ఖాతాల్లో 'రైతు భరోసా' డబ్బులు జమ చేసింది. ఈ మేరకు సోమవారం రైతుల మొబైల్ ఫోన్‌లకు నిధులు జమైనట్లు మెస్సేజీలు వచ్చాయి. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ పథకాన్ని ప్రారంభించిన గ్రామాల్లోని రైతులకే పెట్టుబడి సాయం అందింది. మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసిన విషయం తెలిసిందే. తొలి రోజు ఒక గుంట నుంచి ఐదెకరాల వరకు ఉన్న రైతుల బ్యాంకు ఖాతాల్లో మాత్రమే డబ్బులు జమయ్యాయి. ఏడాదిలో ఎకరానికి రూ.12వేల చొప్పున ఇవ్వనుండగా, మొదటి విడతలో ఎకరానికి రూ.6వేల చొప్పున నిధులు మంజూరయ్యాయి. తమకెప్పుడు వస్తాయోనని అర్హులైన రైతులు ఎదురుచూస్తున్నారు. బ్యాంకు ఖాతాల బ్యాలెన్స్ తనిఖీ చేసుకుంటున్నారు. మరోవైపు ఎంతమందికి 'రైతు భరోసా' సాయం అందినదో సమాచారం జిల్లా వ్యవసాయ శాఖకు లేదు. ఆన్‌లైన్‌లో అప్‌డేట్ కాలేదని సంబంధిత అధికారి ఒకరు తెలిపారు.

విద్యుత్ నోడల్ అధికారి నియామకం

సుభాష్‌నగర్: ఎన్పీడీసీఎల్ ఉన్నతాధికారులు జిల్లాకు నోడల్ అధికారిగా బి అశోక్ (సీఈ, ఆపరేషన్-1)ను నియమించినట్లు ఎస్ఈ రాపల్లి రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. నోడల్ అధికారి క్షేత్రస్థాయిలో పర్యటించి వేసవిలో మెరుగైన విద్యుత్ అందించేందుకు తగిన చర్యలు తీసుకోనున్నారని పేర్కొన్నారు. వేసవిలో విద్యుత్ కార్యాచరణ ప్రణాళికపై ఆయన సర్కిల్ అధికారులతో ఈనెల 29న సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. పురోగతిలో ఉన్న, చేపట్టాల్సిన పనులపై సమీక్ష నిర్వహించి మార్గనిర్దేశనం చేస్తారన్నారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



ఎడపల్లి(బోధన్): ఎడపల్లి మండలంలోని జానకంపేట్ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్లను సోమవారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి తన స్వగృహంలో ఆవిష్కరించారు. ఫిబ్రవరి 5నుంచి 13వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యేకు అందజేశారు. దేవా దాయ ధర్మాదాయశాఖ సహాయ కమిషనర్ శ్రీరామ్ రవీందర్, ఆలయ ఈవో గింజుపల్లి వేణు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



రైతుబంధు రంగు తేలింది

- ముంపు భూములు, గుట్టలకు పెట్టుబడి సాయం
- ఫంక్షన్ హాళ్లు, ఖాళీ ప్లాట్లకు సైతం..
- సర్వేలో వెలుగుచూసిన నిజాలు
- జిల్లాలో సాగుకు యోగ్యం కాని భూములు 10 వేల ఎకరాల పైనే..
- లెక్క తేల్చిన వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు

డొంకేశ్వర్(ఆర్మూర్): రాష్ట్రంలో 'రైతు భరోసా' అమలుకోసం వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు చేపట్టిన సర్వేలో విస్తుపోయే వాస్తవాలు వెలుగుచూశాయి. గత ప్రభుత్వ హయాంలో రైతుబంధు ద్వారా పెట్టుబడి సాయాన్ని గుడ్డిగా ఇచ్చేశారని సర్వేలో తేలింది. ఎస్సారెస్పీలో ముంపునకు గురైన భూములు, అలాగే గుట్టలు, కొండలు, ఫంక్షన్ హాళ్లు, పెట్రోల్ బంకులు, ఇళ్లు, ఖాళీ ప్లాట్లకు రైతు బంధు ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా 440 గ్రామాల్లో సాగుకు యోగ్యంగా లేని 10వేల ఎకరాలకు పైగా భూమిని గుర్తించగా. అత్యధికంగా కమ్మర్‌పల్లి మండలంలో 1,135.02 ఎకరాలు గుర్తించారు.

డొంకేశ్వర్ మండలంలో..

డొంకేశ్వర్ మండలం నికాల్‌పూర్ గ్రామానికి చెందిన దంపతులకు వేర్వేరు పాస్ పుస్తకాలు ఉండగా, 4.20 ఎకరాల భూమి ఎస్సారెస్పీలో ముంపులో ఉంది. ముంపునకు గురైన భూమికి అప్పటి ప్రభుత్వం నష్టపరిహారం కూడా అందజేసింది. అయినప్పటికీ రెవెన్యూ అధికారులు దీనికి పట్టా చేసినట్లు తెలుస్తోంది. దీంతో గత ప్రభుత్వం వీరికి పంట పెట్టుబడి సాయాన్ని అందిస్తూ వచ్చింది. సర్వేలో దీనిని గుర్తించిన ఇరిగేషన్ అధికారులు రైతు భరోసా పోర్టల్ నుంచి తొలగించాలని తహసీల్దార్‌కు లేఖ రాశారు.

■ నూత్‌పల్లిలో ఓ గుట్టకు ఏకంగా పదుల సంఖ్యలో పట్టాలున్నాయి. ఇక్కడ భూమిని దుక్కిదున్ని పంటలు సాగు చేసేందుకు అవకాశం లేకపోయినా మొత్తం 29 ఎకరాలకు రైతుబంధు సాయం దాదాపు 23 మంది పొందారు. సర్వే నంబర్లను గుర్తించిన అధికారులు ఉన్నతాధికారులకు సిఫార్సు చేశారు.

■ సిర్పూర్ గ్రామ పరిధిలోని 276, 275 సర్వే నంబర్లలో ఇళ్లు, ఖాళీ ప్లాట్లు ఉన్నట్లు అధికారులు సర్వేలో గుర్తించారు. ప్రస్తుతం వీటికి పట్టా పాసుపుస్తకాలు ఉండడం గమనార్హం. గ్రామంలో ఇన్నాళ్లు వ్యవసాయ భూమి లేకున్నా చాలా మందికి 'రైతు బంధు' అందుతూ వచ్చింది. వివరాలను సేకరించిన అధికారులు రైతు భరోసా జాబితా నుంచి తొలగించాలని ప్రభుత్వానికి నివేదించారు.

■ డొంకేశ్వర్ మండల పరిధిలో దాదాపు మూడెకరాల్లో నిర్మించిన ఓ ఫంక్షన్ హాలుకు, ఓ పెట్రోల్ బంకుకు సైతం రైతుబంధు మొన్నటి వరకూ అందింది. వీటికి ఇప్పటి దాకా పట్టా పాస్‌పుస్తకాలు ఉండడం గమనార్హం.

ఒక్క డొంకేశ్వర్ మండలంలోనే ఇన్ని విషయాలు వెలుగు చూస్తే, జిల్లాలో అత్యధికంగా సాగుకు యోగ్యంగా లేని కమ్మర్‌పల్లి, ఎడపల్లి, జక్రాన్‌పల్లి, డిచ్‌పల్లి, నందిపేట్, మోపాల్, నవీపేట్ లాంటి మండలాల్లో పరిస్థితి ఏ విధంగా ఉంటుందో చెప్పనవసరం లేదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

మండలాల వారీగా సాగుయోగ్యం కాని భూములు (ఎకరాల్లో..)

ఆలూర్	359.01	కమ్మర్‌పల్లి	1135.02	నిజామాబాద్ రూరల్	416.29
ఆర్మూర్	591.01	కోటగిరి	72.2	నిజామాబాద్ సౌత్	223.16
బాల్కొండ	400.34	మాక్లూర్	327	పోతంగల్	46.35
భీమ్‌గల్	235.38	మెండోరా	261.18	రెంజల్	109.02
బోధన్	502.26	మోర్తాడ్	188.04	రుద్రూర్	71.16
చందూర్	34.19	మోస్రా	13.18	సాలూర	88.18
ధర్పల్లి	222.18	మోపాల్	583.19	సిరికొండ	290.22
డిచ్‌పల్లి	747.09	ముప్కాల్	187.3	వేల్పూర్	257.04
డొంకేశ్వర్	183.38	నందిపేట్	686.01	వర్ని	75.04
ఇందల్వాయి	192.13	నవీపేట్	858.02	ఎడపల్లి	450.33
జక్రాన్‌పల్లి	605.14	నిజామాబాద్ నార్త్	43.16	ఏర్గట్ల	179.17

గంటకు రూ.250



నాగంపేట్‌లో పసుపు తవ్వుతున్న కూలీలు

- జోరుగా పసుపు తవ్వకాలు
- మహారాష్ట్ర నుంచి వచ్చిన కూలీలు

బాల్కొండ: పసుపు తవ్వకాలు జోరందుకున్నాయి. కూలీల కొరత తీవ్రంగా ఉండటంతోపాటు పసుపు తవ్వకం శ్రమతో కూడిన పని కావడంతో కూలీలకు గంటకు రూ.250 చొప్పున చెల్లిస్తున్నారు. కూలీలు ఉదయం 6 నుంచి 10 గంటల వరకు పసుపు తవ్వుతుండగా, ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మహిళలతో రైతులు పసుపు కొమ్ములను రిక్కిస్తున్నారు. పని ఎక్కువగా ఉంటే ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు 12 గంటల పాటు తవ్వకాలు చేపడుతున్నారు. దీంతో కూలీలకు కూడా ఆదాయం సమకూరుతోంది. మహారాష్ట్ర నుంచి వచ్చిన కూలీలు ఎకరానికి రూ.22వేలు గుత్తాగా తీసుకుని పనులు చేస్తున్నారు. యువకులు పెద్ద సంఖ్యలో పసుపు తవ్వే పనికి వెళ్తున్నారు. 4 గంటలు పనిచేస్తే రూ.వెయ్యి వరకు వస్తోందని వారు తెలుపుతున్నారు. కూలీలను రెండు, మూడు రోజుల ముందే మాట్లాడుకోవాల్సి వస్తుండడం కూలీల కొరతకు అద్దం పడుతోంది. పసుపు తవ్వకం కోసం యంత్రాలు లేక పోవడంతో తప్పని సరిగా కూలీలతోనే పనులు చేపట్టాల్సి ఉంటుంది.

నాలుగు గంటలు..



పసుపు తవ్వకం పనికి వెళ్తే గంటకు రూ.250 చెల్లిస్తున్నారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు పసుపు తవ్వకం పనికి వెళ్తే రూ.వెయ్యి కూలీ వస్తోంది. పసుపు తవ్వకాలు పూర్తయ్యే వరకు పనికి వెళ్తాను.

– శ్రీకాంత్, నాగంపేట్

శ్రమతో కూడిన పని



పసుపు తవ్వకం శ్రమతో కూడిన పని కావడంతో గంటకు రూ.250 చెల్లిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పసుపు తవ్వే పని ఉంటే అక్కడే ఉండి తవ్వుతున్నాం. ఒక్కో రోజు రూ.2 వేల వరకు వస్తున్నాయి. – గణేశ్, నాగంపేట్

కూలీల కొరత తీవ్రంగా ఉంది



పసుపు తవ్వకం శ్రమతో కూడిన పని కావడంతో ఖర్చు ఎక్కువగానే ఉంటోంది. పసుపు తవ్వేందుకు కూలీల కొరత తీవ్రంగా ఉంది. దీంతో గంటల చొప్పున కూలి చెల్లించి తవ్వకాలు చేపడుతున్నాం. – మాధవరెడ్డి, రైతు, నాగంపేట్

బడుల్లో సోషల్ ఆడిట్ కమిటీ తనిఖీలు



బాల్కొండ: బాల్కొండ మండలంలోని బోదేపల్లి ప్రభుత్వ పాఠశాల, మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలల్లో సోమవారం రాష్ట్ర సోషల్ ఆడిట్ కమిటీ సభ్యుల బృందం తనిఖీలు చేపట్టింది. ఈ సందర్భంగా వారు బడుల్లో విద్యార్థులకు అందుతున్న భోజనాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. భోజన నిర్వహణలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చర్యలు తీసుకోవడానికి కమిటీ ఆడిట్ చేస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 28పాఠశాలలను ఆడిట్‌కు ఎంపిక చేయగా అందులో బాల్కొండ మండలంలో రెండు పాఠశాలలు ఉన్నాయన్నారు. కమిటీ సభ్యులు మోహన్‌రావు, నగేశ్, సుమలత, ఎంఈవో రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- స్కానింగ్ సెంటర్లు నిబంధనలు పాటించాలి
- ఆరు టీములతో స్కానింగ్ సెంటర్ల తనిఖీ
- అడ్వైజరీ కమిటీ సమావేశంలో డీఎంహెచ్‌వో రాజశ్రీ



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ

నిజామాబాద్‌నాగారం: చట్టాన్ని ఉల్లంఘించే స్కానింగ్ సెంటర్‌లపై కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో రాజశ్రీ స్పష్టం చేశారు. గర్భస్థ పూర్వ, గర్భస్థ పిండ లింగనిర్ధారణ పరీక్షల నిషేధ చట్టంపై వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. లింగ నిర్ధారణ చేస్తే పీసీపీఎన్డీటీ(ప్రీ కాన్సెప్షన్ అండ్ ప్రీనాటల్ డయాగ్నొస్టిక్ టెక్నిక్స్) చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్‌ఎంపీ, పీఎంపీలు రిఫర్ చేసిన ప్రిస్క్రిప్షన్‌ను స్కానింగ్ సెంటర్లు అనుమతించొద్దన్నారు. ఆర్‌ఎంపీ, పీఎంపీలు నిబంధనలకు అనుగుణంగా ప్రథమ చికిత్స కేంద్రాలను కొనసాగించా లని ఆదేశించారు. క్వాలిఫైడ్ డాక్టర్‌ల రిఫరల్ స్లిప్పు లేకుండా మెడికల్ షాపు అబార్షన్ ఔషధాలను విక్రయించొద్దన్నారు. స్కానింగ్ సెంటర్‌ల రికార్డులు, రిపోర్టులు సక్రమంగా నమోదు చేయనిపక్షంలో రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేయడం కుదరదన్నారు. మొత్తం ఆరు టీములతో జిల్లాలోని స్కానింగ్ సెంటర్‌లను ప్రతినెలా తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. నూతనంగా స్కానింగ్ సెంటర్ రిజిస్ట్రేషన్ కోసం ఒక దరఖాస్తు, రెన్యువల్ కోసం ఏడు దరఖాస్తులు వచ్చినట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. రేడియాలజిస్ట్ దీప్తి, పిల్లల వైద్యులు హరిప్రియ, గైనకాలజిస్ట్ కీర్తిప్రియ, డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజన్న, వైద్యులు సమత, రాకేశ్, ప్రోగ్రాం అధికారి సుప్రియ, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రాధ, మహిళా ఎన్జీవో పద్మాసింగ్, ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు(ఆరోగ్య చైతన్య వేదిక), మాధురి(మెప్మా), సౌమ్య(మహిళా శిశు సంక్షేమ శాఖ), డీహెచ్ ఈజీ వేణుగోపాల్, దేవేందర్ పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో డీ అడిక్షన్ సెంటర్

- ఏర్పాటుకు మాదకద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశంలో నిర్ణయం
- మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపాలని సూచించిన ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, ధన్‌పాల్



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పాల్గొన్న ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, ధన్‌పాల్

నిజామాబాద్ అర్బన్: మత్తుపదార్థాలకు అలవాటుపడిన వారిని ఆ వ్యసనం నుంచి బయటికి తీసుకువచ్చేందుకు జిల్లా కేంద్రంలో డీ అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేయాలని జిల్లా స్థాయి మాదకద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశంలో నిర్ణయించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధ్యక్షతన సోమవారం కమిటీ సమావేశం జరిగింది. బోధన్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్య నారాయణ గుప్తా హాజరయ్యారు. జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, రవాణా తదితర అంశాలపై చర్చించారు. మాదకద్రవ్యాల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై పోలీసు, ఎక్సైజ్, ఔషధ నియంత్రణ మండలి అధికారులకు కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్యేలు పలు సూచనలు చేశారు. డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలో గంజాయి సాగు లేనప్పటికీ ఆంధ్ర, ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి నిజామాబాద్ మీదుగా మహారాష్ట్రకు స్మగ్లింగ్ చేస్తున్నందున గట్టి నిఘా ఉంచాలన్నారు. గంజాయి విక్రయించే, వినియోగించే వారిని గుర్తించి కఠిన శిక్ష పడేలా కోర్టులకు సమగ్ర ఆధారాలు సమర్పించాలన్నారు. కల్తీ కల్లు తయారీ కోసం వినియోగించే అల్ప్రాజోలం నిల్వలను గుర్తించాలన్నారు. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరిస్తూ అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా కళాశాలల్లో క్రమం తప్పకుండా అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. డీ అడిక్షన్ సెంటర్ ఏర్పాటుపై సంబంధిత అధికారులతోపాటు ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు విశాల్‌తో కలెక్టర్ తన చాంబర్‌లో ప్రత్యేకంగా చర్చించారు. సెంటర్ ఏర్పాటు దిశగా తక్షణమే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

సమావేశంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వి సోమిరెడ్డి, నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సహాయ సూపరింటెండెంట్ డీసీబీ నాయక్, డీఎంహెచ్‌వో రాజశ్రీ, జిల్లా సంక్షేమ అధికారిణి రసూల్ బీ, పోలీస్, ఎక్సైజ్, రవాణా, ఔషధ నియంత్రణ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ప్రత్యేక అధికారిగా కలెక్టర్



నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్‌ను ఆయన చాంబర్‌లో మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ కలిసి ప్రత్యేకాధికారి బాధ్యతలకు సంబంధించిన పత్రాలను అందజేయగా ఆయన సంతకం చేశారు. ఈనెల 26తో పాలకవర్గ పదవీకాలం ముగియడంతో కలెక్టర్‌ను నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇక నుంచి పాలనాపరమైన నిర్ణయాలు కలెక్టర్ తీసుకోనున్నారు.

ప్రత్యేక అధికారులకు సమస్యల స్వాగతం

- బల్దియాల్లో పేరుకుపోయిన బకాయిలు
- వేధిస్తున్న అధికారుల కొరత
- ఏళ్లకుపైగా పాతుకుపోయిన సిబ్బంది
- అవినీతికి కేరాఫ్‌గా నిజామాబాద్ టౌన్ ప్లానింగ్
- ప్రత్యేక అధికారుల నేతృత్వంలో పాలన గాడిలోపడేనా?



నిజామాబాద్ సిటీ : నిజామాబాద్ కార్పొరేషన్‌లో పాలన గాడి తప్పింది. ఉద్యోగుల్లో జవాబుదారీతనం లేకుండా పోతోంది. మితిమీరిన అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు బల్దియాకు భారంగా మారారు. కోట్లాది రూపాయల మొండి బకాయిలు వసూలు కావడం లేదు. దీంతో పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించలేని దుస్థితి నెలకొంది. సుమారు రూ.50 కోట్ల వరకు మొండి బకాయిలు ఉన్నాయి.

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ప్రత్యేక పాలనలోనైనా బల్దియా పాలన గాడిలో పడాలని పలువురు కోరుతున్నారు. రాష్ట్రంలోనే మూడోపెద్ద కార్పొరేషన్‌గా గుర్తింపు ఉన్న నిజామాబాద్ కార్పొరేషన్‌కు ఇంత వరకు ఎంహెచ్‌వోను నియమించలేదు. దీంతో పారిశుద్ధ్య సిబ్బంది, శానిటరీ ఇన్‌స్పెక్టర్ల పనితీరును పర్యవేక్షించేవారు లేకుండాపోయారు.

టౌన్ ప్లానింగ్‌లో అవినీతి

నిజామాబాద్ కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ విభాగం అవినీతికి కేరాఫ్‌గా మారింది. చేతులు తడపనిదే పనులు కావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫైల్‌కు ఇంత అని నిర్ణయించి వసూలు చేస్తున్నా బాధ్యులపై చర్యలు లేకపోవడంతో అధికారులే దరఖాస్తుదారులను బెదిరించడం గమనార్హం. టీపీవో సత్యనారాయణ ఈ నెలలోనే రిటైర్మెంట్ కానున్నారు. ఇదే అదనుగా పాత ఫైళ్లకు మోక్షం కలుగుతోందని బల్దియా సిబ్బంది ఆరోపిస్తున్నారు. టీపీఎస్ రాజేంద్రప్రసాద్‌ది సైతం అదే దారి అనే విమర్శలున్నాయి. నాలుగు రోజులు మెట్‌పల్లిలో, రెండు రోజులు నిజామాబాద్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఆయన అందుబాటులో ఉండటం లేదని పలువురు వాపోతున్నారు.

వందకు పైగా పోస్టులు ఖాళీ..

నిజామాబాద్ కార్పొరేషన్‌లో వందకు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ముఖ్యమైన విభాగాల్లో సైతం భారీగా ఖాళీలున్నాయి. టౌన్‌ప్లానింగ్‌లో డీసీపీ, ఏసీపీ,టీపీవో-1, టీపీఎస్-3, టీపీబీవో తదితర పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రెవెన్యూ విభాగాన్ని ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. మరోవైపు 1,300 మందికిపైగా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు. బయోమెట్రిక్ లేకపోవడంతో విధులకు హాజరయ్యేవారి సంఖ్య చాలా తక్కువనే విమర్శలు ఉన్నాయి. వేతనాలు మాత్రం ఠంచన్‌గా పొందుతున్నారు.

జిల్లాలోని ఆర్మూర్, బోధన్, భీమ్‌గల్ మున్సిపాలిటీలకు ప్రత్యేక అధికారిగా అడిషనల్ కలెక్టర్ అంకిత్ నియమితులయ్యారు. ఈ మూడు మున్సిపాలిటీల్లోనూ పరిస్థితి అధ్వానంగా మారింది.

ఆర్మూర్ విలీన గ్రామాలకు నిధులేవి?

ఆర్మూర్ మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల అభివృద్ధి కుంటుపడింది. నిధుల లేమితో పనులు సాగడం లేదు. కొత్తగా వెలిసిన కాలనీల్లో వీధి దీపాలు లేకపోవడంతో అంధకారం అలుముకుంది. సీసీ డ్రైయినేజీలు, రోడ్లకు మరమ్మతులు చేయడం లేదని ఆర్మూర్‌వాసులు వాపోతున్నారు.

బోధన్‌లో ట్రాఫిక్ సమస్య..

బోధన్ పట్టణవాసులను ట్రాఫిక్ సమస్య తీవ్రంగా వేధిస్తోంది. ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురికాగా, వాటిని తొలిగించే సాహసం చేయడం లేదు. దీంతో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు పెరుగుతోంది. బోధన్‌లో విలీనమైన 7 గ్రామాల్లో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి.

భీమ్‌గల్‌లో పారిశుద్ధ్య పనులు

భీమ్‌గల్ మున్సిపాలిటీలో పారిశుద్ధ్య పనులు సాఫీగా సాగడం లేదు. రోడ్డుమీదుగా వెళ్లాలంటే ముక్కుమూసుకుని వెళ్లేపరిస్థితి ఉంది. సరైన సిబ్బంది లేక పనులు సాఫీగా సాగడం లేదు. బస్టాండ్ వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్య. రోడ్డు విస్తరిస్తే తప్ప సమస్యకు పరిష్కారం లభించదని పట్టణవాసులు అంటున్నారు.

క్లుప్తంగా

గణతంత్ర పరేడ్‌లో తెయూ ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం ఆఫీసర్‌



తెయూ(డిచ్‌పల్లి): ఢిల్లీలో ఆదివారం జరిగిన గణతంత్ర దినోత్సవాల్లో తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం ఆఫీసర్‌ సునీత (ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, ఆర్మూర్‌) పాల్గొన్నారు. పరేడ్‌లో పాల్గొన్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ స్టేట్స్‌ ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్లకు ఆమె కాంటింజెంట్‌ లీడర్‌గా వ్యవహరించారు. తెయూ ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్‌ ఠాకూర్‌తో పాటు తెలంగాణ నుంచి 8 మంది, ఏపీ నుంచి 10 మంది వలంటీర్లు పాల్గొన్నట్లు తెయూ ఎన్‌ఎస్‌ఎస్‌ కో ఆర్డినేటర్‌ రవీందర్‌రెడ్డి తెలిపారు.

వైద్యారోగ్య శాఖ ఇన్‌చార్జి ఏవోగా రాజేశ్వర్‌

నిజామాబాద్‌ నాగారం: వైద్యారోగ్య శాఖ ఇన్‌చార్జి ఏవోగా రాజేశ్వర్‌ నియమితులయ్యారు. ఈ మేరకు డీఎంహెచ్‌వో రాజశ్రీ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ప్రస్తుతం స్టాటిస్టికల్‌ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. గతంలో ఇన్‌చార్జి ఏవోగా పనిచేసిన చందర్‌ కుష్ఠు నియంత్రణ డివిజన్‌ స్థాయి అధికారిగా కొనసాగనున్నారు.

బిగాల ఎన్నికల అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం



నిజామాబాద్‌ సిటీ: నిజామాబాద్‌ అర్బన్‌ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా 2023 అసెంబ్లీ ఎన్నికల అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇచ్చి అధికారులను మోసం చేశారని కాంగ్రెస్‌ నాయకులు ఆరోపించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్‌ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌ కుమార్‌ మాట్లాడుతూ.. బిగాల గణేశ్‌గుప్త మాక్లూర్‌ మండలంలో 9.16 ఎకరాల స్థలాన్ని రూ.4 లక్షలకు కొన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారన్నారు. ఆ స్థలం మార్కెట్‌ విలువ రూ.2.70 కోట్లు ఉందన్నారు. గణేశ్‌గుప్తా అసలు విలువను కప్పి పుచ్చి అధికారులను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజావాణికి వినతుల వెల్లువ

- అర్జీలను సత్వరమే పరిష్కరించాలి
- కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు

నిజామాబాద్‌ అర్బన్‌: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి 225 ఫిర్యాదులు అందాయి. అర్జీలకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు అంకిత్‌, కిరణ్‌ కుమార్‌, నగర పాలక సంస్థ కమిషనర్‌ దిలీప్‌ కుమార్‌, ట్రెయినీ కలెక్టర్‌ సంకేత్‌, డీఆర్డీవో సాయాగౌడ్‌, నిజామాబాద్‌ ఆర్డీవో రాజేంద్రకుమార్‌, డీపీవో శ్రీనివాస్‌, మెప్మా పీడీ రాజేందర్‌ ఫిర్యాదులు స్వీకరించారు.

వేతనాలు చెల్లించాలని వినతి

పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని ప్రగతిశీల కేజీబీవీ నాన్‌ టీచింగ్‌ వర్కర్స్‌ యూనియన్‌ ఆధ్వర్యంలో ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. అనంతరం కలెక్టరేట్‌ ప్రవేశ మార్గంలో నిరసన వ్యక్తం చేశారు. యూనియన్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం సుధాకర్‌ మాట్లాడుతూ.. జిల్లాలో ఉన్న మోడల్‌ స్కూల్‌ హాస్టళ్లలో పనిచేస్తున్న నాన్‌ టీచింగ్‌, వర్కర్లకు ఐదు నెలలుగా వేతనాలు రావడం లేదన్నారు. నాయకులు నరేందర్‌, ముత్తెన్న, ప్రశాంతి, రజియాబేగం, హారిక, స్వర్ణలత, సత్యశీల, మమత, వాణి పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు, అధికారులు

పాఠశాలపై చర్యలు తీసుకోండి

నగరంలోని సెయింట్‌ జేవియర్‌ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని టీజీవీపీ నాయకులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. పాఠశాలలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో ఓ విద్యార్థిని ప్రమాదానికి గురైందన్నారు. పాఠశాలలో కనీస వసుతుల లేవన్నారు. నాయకులు కరుణాకర్‌, అఖిల్‌ తదితరులున్నారు.

కార్మిక శాఖ మంత్రిని నియమించాలి

ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి వెంటనే కార్మిక శాఖ మంత్రిని నియమించాలని డిమాండ్‌ చేస్తూ ట్రేడ్‌ యూనియన్స్‌ సెంటర్‌ ఆఫ్‌ ఇండియా ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కమిటీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముత్తెన్న, సుధాకర్‌ మాట్లాడుతూ కాంగ్రెస్‌ ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు అవుతున్నా ఇప్పటికీ కార్మిక శాఖ మంత్రిని నియమించలేదన్నారు. దీంతో కార్మికుల సమ్మస్యలు పరిష్కారం కావడం లేదన్నారు.



నరేందర్‌, వెంకన్న, రాజేశ్వర్‌, రమేష్‌, కిషన్‌, మురళి, విఠల్‌, కిరణ్‌, రవి పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

- బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నిజామాబాద్‌ నాగారం: క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌ రెడ్డి అన్నారు. నగరంలోని పాలిటెక్నిక్‌ గ్రౌండ్‌లో వెల్‌నెస్‌ హాస్పిటల్స్‌ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్‌ లీగ్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. చదువుతో పాటు క్రీడలపై దృష్టి పెట్టాలని సూచించారు. హాస్పిటల్‌ ఎండీ సుమన్‌ గౌడ్‌, అసద్‌ ఖాన్‌, వివేక్‌ రెడ్డి, వైస్‌ ప్రెసిడెంట్‌ బొాదు అశోక్‌ కుమార్‌ ఆధ్వర్యంలో ఈ లీగ్‌ ఏర్పాటు చేయగా 24 టీంలు పేర్లు నమోదు చేసుకున్నాయి. కాగా ఈ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు హెల్త్‌ కార్డులు ఇవ్వడం గొప్ప విషయమని ఎమ్మెల్యే అన్నారు. హైదరాబాద్‌లో వైద్య సేవలు అందిస్తున్న వెల్‌నెస్‌ హాస్పిటల్‌ తన ఏడో బ్రాంచ్‌ను ఏప్రిల్‌లో నిజామాబాద్‌లో ఏర్పాటు చేయనుందన్నారు. ఉర్దూ అకాడమీ చైర్మన్‌ తాహెర్‌ బిన్‌ హందాన్‌, వ్యవసాయ కమిషన్‌ సభ్యుడు గడుగు గంగాధర్‌, నుడా చైర్మన్‌ కేశ వేణు, కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ రాజారెడ్డి, విపుల్‌ గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.



టోర్నీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

భూమి కబ్జా చేశారని ఫిర్యాదు

నిజామాబాద్‌ నాగారం : తన భూమిని కబ్జా చేశారని ఓ వ్యక్తి సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. బాధితుడి కథనం ప్రకారం.. నగరంలోని అసద్‌బాబానగర్‌ కాలనీలోని మైనారిటీ గురుకుల పాఠశాల సమీపంలో 2164 సర్వే నంబర్‌లో సుమారు 289 ఎకరాల అటవీ భూమి ఉంది. ఇందులో కొంత మంది పేదలకు పట్టాలు ఇచ్చారు. ఫిర్యాదుదారు తల్లి సయ్యద ఖమర్‌ బానుకు కూడా ప్రభుత్వం ఎకరం భూమి అందజేసింది. ఆ భూమిని సాగు చేసుకుంటున్న వారు ఇటీవల అందులో ఓ గది నిర్మించుకున్నారు. సదరు భూమికి అన్ని పత్రాలు ఉన్నాయి. అయితే తన తల్లి చనిపోవడంతో ఆ భూమిని విల్‌ డీడ్‌ చేయాలని రిజిస్ట్రేషన్‌ ఆఫీసుకు వెళ్లగా అధికారులు ఫారెస్ట్‌ భూమి అని చెప్పారని బాధితుడు తెలిపాడు. దీంతో ఎన్‌వోసీ కోసం దరఖాస్తు చేసుకున్నా ఫారెస్ట్‌ అధికారులు స్పందించలేదని వాపోయాడు. కాగా పక్కనే 2166 సర్వే నంబర్‌లో భూమి ఉన్న ప్రైవేట్‌ వ్యక్తులు ఫారెస్ట్‌ భూమితో పాటు తన భూమిని కబ్జా చేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికే తన భూమిలో నిర్మించుకున్న గదిని తొలగించారని ఆరోపించాడు. తనకు న్యాయం చేయాలని కోరాడు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



గాంధారిలో ర్యాలీ తీస్తున్న అధికారులు



మద్నూర్‌ గురుకులంలో అవగాహన..

గాంధారి(ఎల్లారెడ్డి): వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణాలు చేయాలని ఎస్సై ఆంజనేయులు, అసిస్టెంట్‌ మోటారు వెహికిల్‌ ఇన్‌స్పెక్టర్‌ భిక్షపతి అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం మండల కేంద్రంలో ఆటో, ట్రాక్టర్‌ డ్రైవర్లతో ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్‌ నియమాల గురించి వివరించారు. నియమాలు అతిక్రమిస్తే జరిగే ప్రమాదాలు, నష్టాల గురించి వివరించారు. రోడ్లపై ప్రమాదాలు జరిగితే క్షతగాత్రులను సమీప ఆస్పత్రుల్లో చేర్పించాలని, 108 అంబులెన్స్‌లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

రహదారిపై జాగ్రత్తగా ఉండాలి

మద్నూర్‌(జుక్కల్‌): వాహనదారులు రహదారిపై జాగ్రత్తగా ఉండాలని నేషనల్‌ హైవే, ఆర్టీవో అధికారులు సూచించారు. మండల కేంద్రంలోని బాలుర గురుకుల కళాశాల, బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హైవే అధికారి బాల్‌రాజ్‌ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల సమయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించడం ఎంతో ముఖ్యమన్నారు. డ్రైవింగ్‌ లైసెన్స్‌ ఉన్న వారు మాత్రమే వాహనం నడపాలని చెప్పారు. ప్రమాదాల నివారణ విభాగం మేనేజర్‌ సౌరవ్‌ ప్రతాప్‌ సింగ్‌, ఆర్టీవో అధికారులు రజనీబాయి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘కాకతీయ’ ఆయకట్టుకు వరద కాలువ ద్వారా నీరు

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ నుంచి కాకతీయ కాలువ ఆయకట్టు కోసం వరద కాలువ ద్వారా నీటి విడుదల చేపడుతున్నారు. కాకతీయ కాలువ ద్వారా వారబందీ ప్రకారం జోన్‌–1 కు 3,500 క్యూసెక్కులు వారం రోజులు, జోన్‌–2కు 5,500 క్యూసెక్కులు 8 రోజులు వదలాలని నిర్ణయించారు. ప్రస్తుతం చివరి ఆయకట్టు వరకు కాకతీయ కాలువ నీరు అందడం లేదంటూ వరద కాలువ ద్వారా విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 2,500 క్యూసెక్కులు కాకతీయ కాలువ ద్వారా, 3 వేల క్యూసెక్కులు వరద కాలువ ద్వారా వదులుతున్నారు. జోన్‌– 1 పరిధిలో డీ–5 నుంచి డీ– 53 ఉన్నాయి. వీటి తూములు వారం రోజులు మూసి వేస్తే కిందకు నీరు పోతుంది. వాటిని నియంత్రించడంలో విఫలం అవుతున్న అధికారులు ఒక కాలువ ఆయకట్టుకు మరో కాలువ ద్వారా నీటిని విడుదల చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. కాకతీయ కాలువ 88 కిలోమీటర్‌ వద్ద వరద కాలువ నుంచి నీటిని మళ్లించి కాకతీయ ఆయకట్టుకు అందిస్తున్నారు.



వరద కాలువలో ప్రవహిస్తున్న నీరు

విద్యుదుత్పత్తికి నష్టం

కాకతీయ కాలువ ద్వారా నీటి సరఫరా జరిగితేనే జల విద్యుత్‌ కేంద్రంలో ఉత్పత్తి జరుగుతుంది. ప్రస్తుతం కాకతీయ కాలువ ద్వారా కాకుండా వరద కాలువ ద్వారా నీటిని మళ్లిస్తుండటంతో విద్యుదుత్పత్తికి నష్టం జరుగుతుంది. 3 వేల క్యూసెక్కులతో కనీసం 10 మెగావాట్ల కరెంట్‌ ఉత్పత్తి అవుతుందని జెన్‌కో అధికారులు అంటున్నారు. కాకతీయ కాలువ ద్వారా ప్రస్తుతం 2,500 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉండటంతో ఒక్క టర్బయిన్‌ ద్వారా ఏడు మెగావాట్ల విద్యుత్‌ ఉత్పత్తి చేస్తున్నారు.

తగ్గుతున్న నీటి మట్టం

ప్రాజెక్ట్‌ నుంచి కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతుండటంతో నీటిమట్టం క్రమంగా తగ్గుతోంది. కాకతీయ కాలువ ద్వారా 2,500 క్యూసెక్కులు, వరద కాలువకు 3 వేలు, సరస్వతి కాలువ ద్వారా 700, లక్ష్మి కాలువ ద్వారా 250 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. గుత్ప లిఫ్ట్‌ ద్వారా 270 క్యూసెక్కులు, అలీసాగర్‌ లిఫ్టుకు 412, ఇతర ఎత్తిపోతల పథకాలకు 312 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 362 క్యూసెక్కులు, మిషన్‌ భగీరథ ద్వారా 250 క్యూసెక్కులు పోతుంది. ప్రాజెక్ట్‌ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగుల కాగా సోమవారం సాయంత్రానికి 1082.20(51 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉంది.

అల్లుడిని హతమార్చిన మామ అరెస్ట్‌

మాచారెడ్డి: అల్లుడిని హత్య చేసిన ఘటనలో మామతో పాటు మరో నలుగురిని సోమవారం అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు కామారెడ్డి రూరల్‌ సీఐ రామన్‌ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. మాచారెడ్డి మండలం ఎల్లంపేట గ్రామానికి చెందిన కుంచం ఎల్లయ్య కూతురు నందిని అలియాస్‌ మమతకు సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామానికి చెందిన బోదాసు స్వామితో వివాహం జరిగింది. దంపతుల మధ్య గొడవలు అవుతుండటంతో మమత కొద్ది రోజులుగా తల్లిగారింటి వద్దే ఉంటోంది. అయితే మాట్లాడేది ఉందని ఈ నెల 21న స్వామిని మాచారెడ్డి పోలీస్‌ స్టేషన్‌కు పిలిపించారు. అక్కడ మాటామాటా పెరిగి గొడవకు దారి తీసింది. దీంతో స్వామి, అతని తండ్రి నర్సయ్య బైక్‌పై వెళ్తుండగా ఎల్లయ్య, అతని పెద్దల్లుడు పెనుగొండ సాయిలు, కుంచం తిరుపతి, మృతుడి భార్య నందిని, నితిన్‌ అడ్డుకున్నారు. స్వామిని కర్రలతో కొట్టారు. తీవ్రంగా గాయపడ్డ స్వామిని తండ్రి నర్సయ్య చికిత్స నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించాడు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌ తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ స్వామి మృతి చెందాడు. ఈ కేసులో ఐదుగురు నిందితులను అరెస్ట్‌ చేసినట్లు సీఐ వివరించారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని గండిమాసానిపేటకు చెందిన బోరంచి శోభ, బాబు దంపతులపై దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్‌ సోమవారం తెలిపారు. పొలం అమ్మకం విషయంలో తమ్ముడు బాబు, మరదలు శోభ అడ్డు వస్తున్నారని సాయిలు దాడి చేశాడని ఎస్సై పేర్కొన్నారు. శోభ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఇసుక డంపు స్వాధీనం



నస్రుల్లాబాద్‌(బాన్సువాడ): నస్రుల్లాబాద్‌ మండల కేంద్రం సమీపంలోని క్రషర్‌లో అనుమతులు లేని ఇసుక డంపు ఉండటంతో రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇసుక తమదే అంటూ మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు డిసెంబరు 13న ఇతరుల పేరున ఉన్న వేబిల్లులు అధికారులకు చూపడంతో అనుమానం వచ్చి సీజ్‌ చేశామని గిర్దావార్‌ సాయిలు తెలిపారు. డంపు చేసిన ఇసుకపై పూర్తి విచారణ చేసిన తర్వాత చర్యలు తీసుకుంటామని తహసీల్దార్‌ ప్రవీణ్‌ కుమార్‌ తెలిపారు.

క్రైం కార్నర్‌

సంగారెడ్డి జిల్లాలో మల్లుపల్లివాసి హత్య



భిక్కనూరు: భిక్కనూరు మండలం మల్లుపల్లి గ్రామ బీజేపీ అధ్యక్షుడు మాలే నారాయణ(42) సంగారెడ్డి జిల్లాలో దారుణ హత్యకు గురయ్యాడు. వివరాలు.. నారాయణ సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం రెడ్డి ఖానాపూర్‌ గ్రామంలో ఉన్న ఎఫ్‌పీవో జైకిసాన్‌ సంస్థలో సీఈవోగా పనిచేస్తూ అక్కడే ఉంటున్నాడు. ఈనెల 25న తన భర్త కనిపించడం లేదని నారాయణ భార్య లక్ష్మీనర్సవ్వ హత్నూర పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు మిస్సింగ్‌ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. సోమవారం ఉదయం నారాయణ మృతదేహం పల్లనూరు సమీపంలో కనిపించింది. ఈ విషయమై పోలీసులు భార్య లక్ష్మీనర్సవ్వతో పాటు రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులను, భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన ఇద్దరు యువకులను అదుపులోని తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

బ్యాంకులో షార్ట్‌ సర్క్యూట్‌

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌ కూడలి వద్ద గల ఎస్‌బీఐలో సోమవారం ఉదయం షార్ట్‌ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. బ్యాంకులోని మెయిన్‌ విద్యుత్‌ బోర్డులో షార్ట్‌ సర్క్యూట్‌ కావడంతో మీటరులో మంటలు చెలరేగాయి. వెంటనే స్వీపర్‌ బ్యాంకు అధికారులకు సమాచారం ఇచ్చాడు. ఎలాంటి నష్టం జరగకపోవడంతో సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

ఒకరి అదృశ్యం

కామారెడ్డి క్రైం : కామారెడ్డి మండలం గూడెం గ్రామానికి చెందిన చిందాల తిరుపతిరెడ్డి అదృశ్యమైనట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు. తిరుపతిరెడ్డి కుటుంబంతో కలిసి కొద్దిరోజులుగా కామారెడ్డిలో ఉంటూ గ్రామంలో వ్యవసాయ పనులు చూసుకుంటున్నాడు. ఈ నెల 26న ఇంటి నుంచి వెళ్లిన ఆయన భార్య మాధవికి ఫోన్‌ చేసి ఆర్థికంగా నమ్మిన వాళ్లందరూ మోసం చేస్తున్నారని బాధపడ్డాడు. తర్వాత ఫోన్‌ స్విచ్‌ ఆఫ్‌ చేశాడు. చాలా చోట్ల గాలించినా ఆచూకీ దొరకలేదు. దీంతో అతని భార్య సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ముప్కాల్‌కు చెందిన ఒకరు..

బాల్కొండ: ముప్కాల్‌కు చెందిన కొమ్ముల రవి ఈ నెల 23 నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. డబ్బుల విషయమై భార్యతో గొడవ పడి ఇంట్లో నుంచి వెళ్లిన రవి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై రజనీకాంత్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు



బాల్కొండ: మండలంలోని కిసాన్‌నగర్‌లో సోమవారం రాత్రి స్కూటీని కారు ఢీకొంది. కిసాన్‌నగర్‌కు చెందిన గంగాధర్‌ పాత జాతీయ రహదారి మీదుగా ముప్కాల్‌ నుంచి స్వగ్రామం వెళ్తుండగా ఆర్మూర్‌ వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ప్రమాదంలో గంగాధర్‌కు స్వల్ప గాయాలు కాగా, స్కూటీ నుజ్జు నుజ్జు అయింది.

పెర్కిట్‌ శివారులో..

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ మున్సిపల్‌ పరిధిలోని పెర్కిట్‌ శివారులో కారు, బైక్‌ ఢీకొన్న ఘటనలో చేపూర్‌ గ్రామానికి చెందిన చిన్న గంగారాం గాయపడ్డారు. చిన్నగంగారాం ఆర్మూర్‌లో పని ముగించుకొని బైక్‌పై ఇంటికి వెళ్తుండగా నిర్మల్‌ వైపు వెళ్తున్న కారు వెనుక నుంచి ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ గంగారాంను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని..

బోధన్‌టౌన్‌: బోధన్‌ శివారులోని రమాకాంత్‌ ఫంక్షన్‌ హాల్‌ సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. బోధన్‌ డిపోకు చెందిన బస్సు బీర్కూర్‌ నుంచి వస్తూ ఎదురుగా వస్తున్న స్కూటీని ఢీకొంది. ప్రమాదంలో స్కూటీపై ఉన్న వ్యక్తికి తీవ్రగాయాలు కాగా నిజామాబాద్‌ తరలించారు.

చోరీ కేసుల్లో ప్రధాన నిందితుడి అరెస్ట్‌

ఖలీల్‌వాడి: దుకాణాల షట్టర్లను ధ్వంసం చేసి చోరీలకు పాల్పడుతున్న ముఠా నాయకుడిని అరెస్ట్‌ చేసినట్లు ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఏసీపీ కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని పర్బనికి చెందిన కరణ్‌ సింగ్‌, లాథూర్‌కు చెందిన కరణ్‌ సింగ్‌ బావూరి, అజయ్‌సింగ్‌, జల్నాకు చెందిన మనోహర్‌ సింగ్‌ ముఠాగా ఏర్పడి చోరీలు చేస్తున్నారు. అర్ధరాత్రి దుకాణాల షట్టర్లు ధ్వంసం చేసి వీరు దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈ ముఠా జిల్లాలో 11 చోట్ల చోరీలు చేసింది. దీంతో పోలీసులు నాలుగు బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఒకటో టౌన్‌ ఎస్‌హెచ్‌వో రఘుపతి తన బృందంతో ప్రధాన సూత్రధారి కరణ్‌ సింగ్‌ను పట్టుకున్నట్లు ఏసీపీ తెలిపారు. నిందితుడు నేరాలను అంగీకరించాడని చెప్పారు. కరణ్‌సింగ్‌ వద్ద బైక్‌, ఇనుప రాడ్లు, బట్టలు స్వాధీనం చేసుకున్నామన్నారు. సమావేశంలో ఎస్‌హెచ్‌వో రఘుపతి, ఎస్సై మొగులయ్య, ఏఎస్సై షకీల్‌, కానిస్టేబుల్‌ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి

జల్సాలకు అలవాటు పడి బైక్‌ చోరీలు

ఖలీల్‌వాడి: జల్సాలకు అలవాటు పడి హెచ్‌ఎఫ్‌ డీలక్స్‌ బైక్‌లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న మూగ యువకుడిని అరెస్ట్‌ చేసినట్లు ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి తెలిపారు. నిజామాబాద్‌ రూరల్‌ మండలం గుండారం గ్రామానికి చెందిన తాడెం అనిల్‌కుమార్‌కు మాటలు రావు. జల్సాలకు అలవాటు పడిన అనిల్‌ నాలుగు హెచ్‌ఎఫ్‌ డీలక్స్‌ బైక్‌లను చోరీ చేశాడు. కంఠేశ్వర్‌లో వాహనాల తనిఖీ చేస్తుండగా పోలీసులను చూసి పారిపోవడానికి యత్నించాడు. అదుపులోకి తీసుకుని విచారించగా తన సైగల ద్వారా చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడని ఏసీపీ తెలిపారు. నిందితుడి నుంచి నాలుగు బైక్‌లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసును ఛేదించిన ఎస్సై హరిబాబు, సిబ్బందిని ఏసీపీ అభినందించారు. టౌన్‌ సీఐ శ్రీనివాసరాజు, ఎస్సై హరిబాబు పాల్గొన్నారు.

పల్సర్‌ బైక్‌ చోరీ చేసిన ఇద్దరు..

పల్సర్‌ బైక్‌ దొంగతనం చేసిన ఇద్దరిని అరెస్ట్‌ చేసినట్లు ఏసీపీ తెలిపారు. మాక్లూర్‌ మండలం వేణుకిషన్‌నగర్‌కు చెందిన ఒల్లెపు గోపి(20), ద్యారంగుల సంతోష్‌(23) కంఠేశ్వర్‌లో బైక్‌ చోరీ చేశారు. నగరంలోని గుర్బాబాది రోడ్డులో కృష్ణమందిర్‌ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పోలీసులను చూసి ఇద్దరు పారిపోతుండగా పోలీసులు పట్టుకున్నారు. వారిని విచారించగా జల్సాలు, మద్యానికి బానిసలై చోరీ చేస్తున్నట్లు ఒప్పుకున్నారని ఏసీపీ తెలిపారు. నిందితుల నుంచి బైక్‌ను స్వాధీనం చేసుకన్నట్లు చెప్పారు. సమావేశంలో టౌన్‌ సీఐ రాజశేఖర్‌రాజు, ఎస్సై హరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పొలంలో పడి యువకుడి మృతి



ప్రశాంత్‌ (ఫైల్‌)

రెంజల్‌(బోధన్‌): వ్యవసాయ కూలీ పనులకు వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తు పొలంలో పడి మృతి చెందాడు. ఈ ఘటన రెంజల్‌ మండలం తాడ్‌బిలోలి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన పద్మశాలి కిషన్‌ అనే రైతు పొలంలో ఎరువులు చల్లడానికి ఏస ప్రశాంత్‌(28) ఆదివారం కూలీ పనులకు వెళ్లాడు. సాయంత్రం ఎరువుల బస్తాను తీసుకుని వెళ్తుండగా ప్రమాదవశాత్తు ఒడ్డుపై జారి పొలంలో పడిపోయాడు. దీంతో నోట్లోకి బురద వెళ్లింది. వెంటనే గుర్తించిన పొలం యజమాని అతడిని బోధన్‌ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌ తరలించారు. ఊపిరితిత్తుల్లోకి బురద చేరడంతో మృతి చెందినట్లు వైద్యులు గుర్తించారు. మృతుడి బావ రవి ఫిర్యాదు మేరకు సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ ఒకరు..

బాన్సువాడ: పిట్లం మండలం హస్నాపూర్‌కు చెందిన లక్ష్మణ్‌ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు సీఐ అశోక్‌ తెలిపారు. రెండు రోజుల క్రితం బాన్సువాడ శివారులోని శివాజీ విగ్రహం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో లక్ష్మణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో చికిత్స నిమిత్తం నిజామాబాద్‌కు తరలించగా అక్కడ మృతి చెందినట్లు సీఐ తెలిపారు.

చిన్నాపూర్‌కు చెందిన వ్యక్తి..

మోపాల్‌: మండలంలోని చిన్నాపూర్‌ గ్రామానికి చెందిన శివోల్ల భూమయ్య (42) చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు ఎస్సై యాదగిరి గౌడ్‌ తెలిపారు. భూమయ్య ఆటోడ్రైవర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పదేళ్లుగా మద్యానికి బానిసై సరిగ్గా పని చేయడం లేదు. దీంతో కుటుంబ సభ్యులు మందలించడంతో భూమయ్య ఈనెల 21న పురుగుల మందు తాగాడు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న భూమయ్య సోమవారం మృతిచెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బీహార్‌ కూలీ ఆత్మహత్య

బాన్సువాడ: బాన్సువాడలోని గాలీగూడలో బీహార్‌కు చెందిన కూలీ సోనుకుమార్‌ పాశ్వాన్‌(24) ఆత్మహత్య చేసుకున్నాడు. బీహార్‌లోని రాగద్దపూర్‌కు చెందిన సోనుకుమార్‌ కొన్ని రోజుల క్రితం సోని అనే అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ప్రస్తుతం ఆమె గర్భవతి. ఆదివారం సోని ఆస్పత్రికి వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో సోనుకుమార్‌ ఉరి వేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ అశోక్‌ తెలిపారు.

నాళేశ్వర్‌లో యువకుడు..

నవీపేట: మండలంలోని నాళేశ్వర్‌ గ్రామానికి చెందిన చిన్నదొడ్డి రాజేందర్‌(32) సోమవారం ఉదయం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎలక్ట్రీషియన్‌గా పనిచేసే రాజేందర్‌ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. నిజామాబాద్‌కు చెందిన యువతిని పెళ్లి చేసుకోగా రెండేళ్ల కింద విడాకులయ్యాయి. ఆర్థిక ఇబ్బందులతో పాటు తాగుడుకు బానిసైన రాజేందర్‌ ఇంట్లో ఉరి వేసుకున్నాడు. అయితే ఓ మాజీ ప్రజాప్రతినిధి మందలించడంతో అవమానాన్ని భరించలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడని పోలీసులకు సమాచారం అందింది. దీంతో మాక్లూర్‌ ఎస్సై రాజశేఖర్‌, నవీపేట ఏఎస్సై మోహన్‌రెడ్డి గ్రామానికి విచారణకు వెళ్లగా అంతలోపే అంత్యక్రియలు పూర్తి చేశారు. దీంతో పోలీసులు మృతుడి కుటుంబ సభ్యుల వాంగ్మూలం సేకరించారు.

ఐదుగురికి జైలు శిక్ష

బోధన్‌టౌన్‌: బోధన్‌ పట్టణ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో ఐదుగురికి సెకండ్‌ క్లాస్‌ మేజిస్ట్రేట్‌ శేషసాయి తల్ప సోమవారం ఒక రోజు జైలు శిక్ష విధించారని సీఐ వెంకట నారాయణ తెలిపారు. బోధన్‌ మండలం సంగం గ్రామానికి చెందిన గంగదీపక్‌, రెంజల్‌ బేస్‌కు చెందిన సాయిలు మద్యం తాగి వాహనాలు నడిపారు. వారిని కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఒక రోజు జైలు శిక్ష విధించారు. రాకాసీపేట్‌లో మద్యం తాగుతున్న ఇద్దరికి, అంబేడ్కర్‌ చౌరస్తాలో పండ్ల బండితో ట్రాఫిక్‌ అంతరాయం కలిగిస్తున్న వ్యక్తికి సైతం ఒక రోజు జైలు శిక్షను విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

గంజాయి పట్టివేత



ఖలీల్‌వాడి: నగరంలోని బోర్గాం(పి) కమాన్‌ ప్రాంతంలో గంజాయి అమ్ముతున్న వ్యక్తిని పట్టుకున్నట్లు ఎక్సైజ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ సీఐ వెంకటేష్‌ సోమవారం రాత్రి తెలిపారు. గౌతంనగర్‌కు చెందిన శ్రావణ్‌ గంజాయి విక్రయిస్తుండగా పట్టుకొని, 530 గ్రాముల ఎండు గంజాయి, ఒక సెల్‌ఫోన్‌, బైక్‌ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు. దాడిలో ఎస్సై నర్సింహాచారి, సిబ్బంది భూమన్న, విష్ణు, అవినాష్‌, శ్యామ్‌, సాయి కుమార్‌ పాల్గొన్నారు. గంజాయి అమ్మినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.